విచిత్రచిత్రాలు:

# ఆ గుండెలోని ప్రాణం

రచన: 'మధుపం'

ఏమిటో చెబుతారు కాని పెద్దలు, యదార్థంగా జీవితం అంటే తెలుసుకున్న వాళ్లు లేరంటే నమ్మ. అంతా అదో కలగా ఉంటుంది. కొన్ని పనులు మనం చెయ్యాలని చేసి మన పీకలమీదికి తెచ్చుకుంటాము. మొన్నటినుంచి ఇదే ఆలోచిస్తున్నాను. పెద్ద ఉపకారాలు చేద్దామని మనసు ఘోషిస్తుంది కాని, చేసేవాళ్లే చాలా తక్కువ. అథవా, చేసినా, మళ్ళీ కొన్ని మనకే ఎదురు తిరుగుతాయి.

ఇంతకీ నే చెప్పేది ఏమిటంటే ఏదో మంచి చేశామని అనుకోవడమే కాని, దానికి ఫలితం అనుభవించడానికి మనం కర్తలము కాము.

నేను వేదాంతిలా మాట్లాడుతున్నాననుకోకు. చెప్పబోయేది పూర్తిగా వింటే నావంటి ద్రోహి లేడనిపిస్తుంది. అలా అని నేను ఏమన్నా ద్రోహం చేశానా అంటే చెయ్యనూ లేదు. మరో పరిస్థితిలో అవుతే ఈ విషయం నీకు చెప్పి ఉండను కాని, ఇవ్వాళ ఈవిషయం నీకు చెప్పేస్తే నా తలమీది భారం సగం తగ్గినట్టుంటుంది. నాకు బాగా తెలుసును. రేపు విచారిస్తాను, నీకు ఈ విషయం చెప్పినందుకు. అయినా ఇప్పుడు మాత్రం దాచలేను.

♦ ♦ ♦

ఆ రోజుల్లో నాకు కుర్రతనం ఇంకా బాగా వదలలేదు. వయస్సు ముప్ఫయ్యి; వయసు ముదిరినా మేధస్సు లేతదే. నీకు ఆ విషయం తెలుసు.

ఆ రోజుల్లోనే నాకు ఒక్కసారి దేశమంతా తిరిగి రావాలనిపించింది; మా అమ్మ అస్థికలను గంగలో కలిపే సంకల్పం కూడా ఉంది ముఖ్యంగా. పన్నెండేళ్ళ మాట; సరిగా జ్ఞాపకం వచ్చి చావదు.

ఉత్తర హిందూస్థానం అంతా తిరిగిన తరువాత, దక్షిణాదికి కూడా వెళ్ల బుద్ధి పుట్టింది. మద్రాసులో ఒక హోటల్లో మకాం పెట్టాను. మధ్యాహ్నం ఊరంతా తిరిగాను. చాలా అలసిపోయి ఉన్నా. ఒళ్ళంతా చెమటతో ముద్దయిపోయింది. కాస్సేపు అలసట తీర్చుకుందుకు మరీనాలో కూర్చుని, ప్రొద్దుపోయాక బసకు బయలుదేరాను. కాస్త ఏమన్నా నోట్లో వేసుకోవాలనిపించింది—బసకు పోయింతరువాత ఎలాగా భోజనం చెయ్యవలసిన అవసరమున్నా. బాగా ఆకలెయ్యటం లేదు; నీరసం మాత్రం ఎక్కువగా ఉంది. కాఫీ త్రాగే నిశ్చయంతో దగ్గరలో వున్న హోటలుకు వెళ్ళాను.

రాత్రి ఎనిమిదో, ఎనిమిదిన్నరో అవుతుంది.

అట్టే జనసమ్మర్దంలేని చిన్న హోటలు. కాఫీ త్రాగి చక్కా పోదామనుకున్న వాడినల్లా, పూరీకూడా తిందామనుకున్నా. మాయ జిహ్వ! అలా అనిపిస్తుంది కాని, నిజంగా బాగా ఆకలి లేదు సుమా! కాని ఆకలేసే తింటామా అన్నిసార్లూనూ? అదో సరదా, కోరికా. పూరీ వేసి తెచ్చేటప్పటికి ఆలస్యమౌతుందని ఓ బజ్జీ కూడా తెమ్మన్నాను.

ఈలోగా ఒక యువకుడు వచ్చి నా యెదురుగా కూర్చున్నాడు. కొత్తగా మొలకలెత్తే మీసానికీ, గడ్డానికి సంస్కారం ఏమీ లేదు. రోడ్డుమీది దుమ్ము కొంత తనపొట్టి చేతుల పొట్టిచొక్కామీద స్థావర మేర్పరచుకుంది. అరకప్పు కాఫీ తెప్పించుకొని, కాస్త చప్పరించి, చెక్కెర కావాలన్నాడు. ఒక చెంచాడు అంగుట్లో వేసుకొని, ఆ పానకాన్ని ఒక్కొక్క చెంచాడు తాగుతూ వచ్చాడు. తనకి ఆ వేళకి లభించిన ఆ కాస్త కాఫీనీ ఎంతసేపు త్రాగుతే, అంత ఆకలి తీరుతుందనుకున్నాడు కాబోలు!

ఇంతలో నాకు పూరీ, బజ్జీ రెండూ కూడా ఒకసారే తెచ్చి నాముందు పెట్టాడు ఆయ్యరు ఛోక్రా. ఈ సంగతి తెలుస్తే నేనసలు బజ్జీ తెప్పించుకొని ఉండను. పూరీ వచ్చేలోగా, నోరాడించడానికి నేను వాటిని తెమ్మన్నాను.

తీరా తెచ్చిన తరువాత, వాటిని తీసుకొని పొమ్మనడం మర్యాద కాదు.

బజ్జీ ముందు తింటే పూరీ చల్లారిపోతుంది. అందుచేత పూరీతోనే మొదలుపెట్టాను అల్పాహారం. తలెత్తిచూస్తే నా యెదుటి మనిషి నాకేసి కొంత ఈర్ష్యతో చూస్తున్నాడనిపించింది. నాకు నిజంగా కోత పుట్టింది. ఎవరి సామర్థ్యం కొద్దీ వారు తింటారు. దానికి ఒకరిమీద ఒకరు ఈర్ష్య పెట్టుకుంటే ప్రయోజనం ఏముంటుంది? పూరీ నములుతూ, అతనికేసి చూడ్డం ఇష్టంలేక ఓ ప్రక్కకు మొహంతిప్పి వేసుకొని, పూరీ కూరని నెమరవెయ్యడం ప్రారంభించాను.

ఒక అరనిమిషంలో ప్లేటుకేసి తిరిగి చూసే సరికి, పొడుగాడి అరటి బజ్జీలు మూడింటిలో ఒకటి మాయమైంది. ఎదురుగా ఉన్న యువకుడికేసి చూసాను. ఎడంచేతి చూపుడువేలు పై పెదవిమీద పెట్టి, మిగత వ్రేళ్లు మూతికి అడ్డంపెట్టి, తాపీగా నమలడం చూసాను. కుడి చెయ్యి మాత్రం ఏమీ యెరగనట్టు కాఫీ కప్పులో చెంచాని తిప్పుతోంది. కళ్ళు తప్పుపని చేసినట్టు నేలకేసి చూస్తున్నాయి.

నాకు అపరిమితమైన కోపం వచ్చింది-కాని ఇంకో క్షణంలో వెంటనే చల్లారింది. నే నేదో అనబోయే లోపున అతనిమీద జాలి కలిగింది. కడుపునిండా తిండిలేక పోబట్టి-అనుకున్నాను.

అలా అనుకుని ఊరుకోవలసింది. నాల్కకి నరం లేదంటారు పెద్దలు; ఊరుకోబుద్ధి కాలేదు. "పాపం! ఆకలేస్తూంది లావుంది ఇవికూడా తీసికోండి!" అంటూ మిగతా బజ్జీలు రెండూ ఉన్న ప్లేటుం అతని ముందుకు తోసాను.

ఖంగారు పడ్డాడు; వద్దనాలని మనసు; తీసికోమని జిహ్వా, మాటాడకుండా ఆ రెండూ బజ్జీలు తినేశాడు. నేనుమాత్రం కృతజ్ఞతను సూచించే చూపులకుకూడా నోచుకోలేను!

అతను తన అణాబిల్లు ఇవ్వడానికి లేచాడు. నేనేమీ మాటాడి అతని మనసు కష్టపెట్ట దలచుకోలేదు. నేను ఇచ్చిన మూడు బజ్జీల కోసం, సానుభూతి చూపుతే అతడు కించపడక మానడు. నాతో చెప్పకుండానే లేచి వెళ్లి అతని బిల్లు చెల్లించాడు. అతని కాలుచూస్తూ నేను కాఫీ త్రాగుతున్నా-అతని తెల్లటి మోకాలు వెనుకభాగంలో నల్లటిమచ్చ, ఇప్పటికీ నాకు కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది.

నేను కాఫీతాగి బయటకు వచ్చాను. అతనక్కడ నుంచున్నాడు-నాతో మాటాడాలనేమో! అయినా నా అంతట నేనుమాత్రం పలుకరించ దలచుకోలేదు. దీపాలులేని వెన్నెల్లో అతనికంఠం నన్ను పిలిచింది.

"ఏం?" అన్నాను.

"ఏముంది? నే నటువంటివాడని కాదసలు-ఆకలితో ఛస్తున్నాను. అందుచేత ఆ మాత్రానికి కక్కుర్తి పడ్డాను. ఇంతట్లో మీరు నాకేదో మహోపకారం చేసినట్టుగా తలుస్తున్నారేమో? చెప్పండి. కావలిస్తే మీకు ఆ డబ్బులు ఇచ్చి వేస్తా, తెల్లవారేలోపున."

"నేనలా ఏమీ అనుకోలేదు. మీరు అనవసరంగా అటువంటిశ్రమ ఏమీపడొద్దు" అన్నా.

ఆ గుడ్డివెన్నెలలో నా మొఖంలోకి తీవ్రంగా చూసి అన్నాడు: "ఇంక యిదే ఆఖరిసారి. ఈ విధంగా ఇంక చెయ్యవలసిన అవసరంలేదు. తెల్లవారేలోగా అన్నీ తేలిపోతాయి!"

"ఏమిటి తేలిపోతుంది!" అన్నాను.

"వెధవబ్రతుకు, ఛీ, ఛీ!" అన్నాడు.

వెన్నెల్లో ఒక సందులోకి పోతున్నాడు. ఆ ప్రక్కనుంచి వెడితే చాలామంది ఆత్మహత్య చేసుకొనే ఒక చెరువు వస్తుంది. నేనువచ్చి వారంరోజులే అయినా అందులోపడి ఇద్దరు మరణించడం యెరుగుదును.

ఈ యువకుడి వాలకంచూస్తే నాకు భయమేసింది. తెలిసుండికూడా చావు తప్పించలేక పోతిని గదా, అనే విచారం జీవితాంతంవరకూ ఉంటుందని యెంతో బాధపడ్డాను. అతను అందరివంటివాడు కాడనిపించింది ఎందుకో. వెంటనే అతనివెంట నాలుగు అడుగులేశాను. పిలిచి ఆగమన్నాను. ఆగాడు; నేనిలా చెప్పాను:

"యదార్థంగా బ్రతకడం ఇష్టంలేకపోతే, చచ్చిపోవడానికి ప్రతివాడికీ అధికారముందని నా నమ్మకం, 'లా' ఏమన్నా-నువ్వు ఆత్మహత్య చేసుకుంటానంటే నేను వద్దనను. కాని డబ్బులేక యీపని చెయ్యడం చాలా అసహ్యంగా ఉంటుంది. కావలిస్తే నేనొక కొంత-నీకు తోచినంత, ఓపిక ఉన్నంత-ఇస్తాను అది పుచ్చుకో."

"అబ్బే అందులో ప్రయోజనం ఏముంది? ఈ రోజు, ఇంకా నాల్గురోజుల తర్వాత వస్తుంది, ఆ డబ్బు అయిపోగానే. ఎందుకువచ్చిన బాధ ఇదంతా, అయినా మీకూ నాకూ సంబంధం-అ

బజ్జీకి మీరిచ్చిన అణావల్లే కొవస్తే మీకు అణా ఇచ్చివేస్తా.''

నిజంగా బ్రతికేమనిషి మాట్టాడేటట్టు నాకు కనిపించలేదు. ఈ నిర్లక్ష్యము, మొండితనాన్ని చూస్తే క్రమంగా నచ్చచెప్పాను. నే ఇచ్చే పాతిక రూపాయిలు జాగ్రత్తగా కర్చుపెట్టు కొంటూ, ఈలోగా ఒక ఉద్యోగం సంపాదించుకోమని; కొంతసేపటికి ఒప్పుకొన్నాడు. నాతో రమ్మన్నాను; రానన్నాడు. ఎన్నోవిధాల నచ్చచెప్పడానికి ప్రయత్నించాను.

“మీరు ఇస్తే ఇయ్యండి. ఆ పాతికో పరకో కాని నేను జీవితంలో పైకివచ్చినా, ఆడబ్బు మళ్ళీ మీకు ముట్టచెప్పడానికి బాధ్యతవహించను. అలా ముట్టచెప్పి, జీవితాంతంవరకూ మీరు నాకు ప్రాణం పోశారని అనుకుంటూ జీవించేకంటే, ఇప్పుడే ఛస్తే మంచిది. మీకూ నాకూ ఏమీ సంబంధములేదు. రేపు మీరు కనిపించినా మీతో నాకు మాటాడాలని ఉండదు;. మాటాడను. ఇప్పుడు మీతో మీబసకు రానూరాను.''

ఈతత్వం మనుషులు రాజుకంటెబలవంతులు; విధిలేక ఒప్పుకున్నాను.

అదే విషయం ఆలోచిస్తూ, గదికివచ్చి పడుకున్నా. తర్వాత ఎన్నోసార్లుప్రయత్నించి చూసాను. అతను మళ్లా ఎక్కడ ఉన్నాడో తెలుసుకోవాలని. కాని ఏమి ప్రయోజనం లేకపోయింది. ఈ విషయము ఎవరితోను చెప్పనని అతని కిచ్చినమాట నిలబెట్టుకొన్నా ఈ నాటివరకూ. * * *

ఎన్నో ఋతువులు అబ్దాలు గడచిపోయాయి.

పిల్లలు పెద్దవాళ్లై నాకు బుద్ధులు చెప్పే వయసు గాళ్లయారు. ఈ యువకుడిమాట నేను మఱచిపోయాననే అనుకోవచ్చు.

ఈమధ్య నా పెద్ద అల్లుడికి ఉండి ఉండి జీవితంమీద అసహ్యం కలిగింది. అనవసరంగా నాకూతుర్ని అనుమాన పడ్డాడు. మళ్ళీ పెద్ద మనిషి, ఉద్యోగస్థుడు. నాకు అసహ్యమేసింది. మొహంచూడ బుద్ధికాలేదు. నానా మాటలు అన్నాను. మాట్లాడకుండా, పైకి కట్టుకొన్న పంచనికూడా సర్దుకోకుండా, జట్కావాణ్ణి పిలచి తనఊరికి బండి కట్టమన్నాడు.

ఇన్నాళ్లబట్టీ నేను చూడనేలేదు; అతని తెల్లని మోకాలుకి వెనక భాగముమీద నల్లటి మచ్చ కనిపించింది. అదే అప్పటినుంచీ నా గుండెలో పెద్ద వ్రణమయింది!

